క్లుప్తంగా

జీవో 49 రద్దు చేయాలి



సమావేశమైన ఆదివాసీ నాయకులు

బోథ్: ప్రభుత్వం: జీవో 49 రద్దు చేయాలని సొనాల మండలంలోని పార్డి(బి) రాయి సెంటర్‌లో ఆదివాసీలు తీర్మానం చేశారు. ఆదివారం రాయిసెంటర్ పరిధిలోని గ్రామాల్లోని ఆదివాసీలు, గ్రామపటేల్‌లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కులను జీవో 49 కాలరాస్తుందన్నారు. జీవో రద్దు చేయకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామాల పటేల్‌లు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

రుతికను సన్మానించిన ఏఐఎస్‌ఎఫ్ నాయకులు



రుతికను సన్మానిస్తున్న నాయకులు

బోథ్: లాసెట్‌లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించిన ఎల్కుచి రుతికను ఏఐఎస్‌ఎఫ్, సీపీఐ నాయకులు ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతం నుంచి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం ఇటీవల ఆత్మ చైర్మన్‌గా నియమితులైన గొర్ల రాజు యాదవ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోవర్ధన్, నరేశ్, ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్షుడు మున్సిఫ్. కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై

బోథ్: మండల కేంద్రం నుంచి మర్లపెల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో బోథ్ ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆదివారం వాహనాలను తనిఖీ చేపట్టారు. నెంబర్ ప్లేట్ లేని ఐదు వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని ఎస్సై పేర్కొన్నారు. వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రుల మీద కేసు నమోదు చేస్తామన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

దలైలామ జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న నాయకులు

బోథ్: దలైలామా జన్మదిన వేడుకలను సొనాల మండల కేంద్రంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. 13వ శతాబ్దం నుంచి దలైలామాలు శాంతి మార్గమే ప్రపంచానికి మేలు చేస్తుందని, కోరికలు దుఃఖానికి కారణమని, అలాంటి కోరికల్ని త్యజించి అందరూ శాంతి మార్గంలో నడవాలని ప్రచారం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు మెరుగు మహేశ్, అమృత్ రావు పాటిల్, భగత్ ప్రవీణ్, బత్తుల రమేశ్, మద్దెల మహేశ్, ప్రభాకర్, షేక్ మొహమ్మద్, ఆసిఫ్ పాల్గొన్నారు.

'రానున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే'

తాంసి: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం తాంసి మండలంలోని అట్నంగూడ గ్రామంలో మండల బీఆర్‌ఎస్ యువ నాయకుడు అశోక్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు కొడాల మహేందర్, అశోక్, అభిరాం రెడ్డి, రజనీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

తలమడుగు: పేదింటి ఆడ బిడ్డలను ఆదుకోవాలనే ఉద్దేశంతోనే కేసీఆర్ కల్యాణ లక్ష్మి పథకాన్ని ప్రారంభించారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రైతువేదికలో వివిధ గ్రామాలకు చెందిన 29 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చి తులం బంగారం ఇస్తామని పేదలకు హామీ ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశ్, కేదరేశ్వర్ రెడ్డి, అభిరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రకాష్ రెడ్డి, మొట్టె కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పంటలకు వరద ముప్పు..!



కొరటా- చనాఖా రిజర్వాయర్

- తక్కువ ఎత్తులో ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం
- కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం
- గతంలో 300 ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- ఆందోళనలో అన్నదాతులు

సాత్నాల: భోరజ్ మండలంలోని కొరటా- చనాఖాలో నిర్మిస్తున్న రిజర్వాయర్ పనుల్లో ఇంజనీర్లు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పంటలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. రిజర్వాయర్‌లో నిల్వ ఉంచిన నీరు, వర్షపు నీరు చేరడంతో పంటలు మునిగిపోతున్నాయని, ఊరిలోకి నీరు వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 2023లో ఇలా ప్రవహించడంతో దాదాపు 300 ఎకరాల సాగు భూమి ముంపుకు గురైంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట పొలాల్లోకి నీరు చేరి నష్టపోయారు. ఈసారి సైతం అధిక వర్షాలు కురుస్తున్నాయి. గతంలో మాదిరిగానే పంటలు నష్టపోతామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముంపుకు గురైన పంటలకు పరిహారం సైతం చెల్లించలేదని వాపోతున్నారు. ప్రొటెక్షన్ వాల్‌ను ఎక్కువ ఎత్తులో నిర్మించాలని చెప్పినప్పటికీ పట్టించుకోకపోవడంతో నష్టపోవాల్సి వస్తుందన్నారు.

తక్కువ ఎత్తులో నిర్మించడంతో..

కొరటా- చనాఖా ప్రాజెక్టు వద్ద నిర్మించిన రిజర్వాయర్ వద్ద ప్రొటెక్షన్ వాల్‌ను తక్కువ ఎత్తులో నిర్మించారు. దీంతో వరద ప్రవాహం వచ్చిన సమయంలో నీరు ఉప్పొంగి పంట చేలల్లోకి చేరుతుంది. అధికారుల నిర్లక్ష్యమో.. కాంట్రాక్టర్ల అలసత్వమో గానీ ఇది రైతులకు శాపంగా మారింది. పెన్‌గంగ నుంచి వచ్చే నదిజలాలను పంప్ హౌస్‌లో స్టోరేజ్ చేసి, సాగునీరు అందించాలనే ప్రధాన ఉద్దేశంతో నిర్మించారు. శివాలయం నుంచి ఏరోప్లేన్ గ్రౌండ్ వరకు ప్రొటెక్షన్ వాల్ ఎత్తు తక్కువగా ఉండడంతో రిజర్వాయర్‌లోని నీరు, వర్షపు నీరుకు తోడై కుడి వైపు ఉన్న కొరటా పరివాహక ప్రాంతాల్లో నీరు పారుతుంది. సంబంధిత అధికారులు స్పందించి 200 మీటర్ల ఎత్తు గోడ నిర్మించి తమ గ్రామాన్ని కాపాడాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

గోడ ఎత్తు పెంచాలి



ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న సమయంలోనే ఇంజనీర్లకు, అధికారులకు ప్రొటెక్షన్ వాల్ ఎత్తు పెంచాలని కోరాం. ఇంజనీర్లు, అధికారులు మాటలు పట్టించుకోకుండా తక్కువ ఎత్తులో గోడ నిర్మించారు. 2023లో పంటలు నష్టపోయినా కనీసం పరిహారం చెల్లించలేదు. ఇప్పటికైనా ప్రొటెక్షన్ వాల్ ఎత్తును పెంచాలి.

– రాజశేఖర్, కొరటా గ్రామ రైతు

పంటలు నష్టపోయాం



ముంపు నీటితో పంటలు నష్టపోతున్నాం. గతంలో ఆయా పార్టీల నాయకులతో పాటు అధికారులకు విన్నవించడం జరిగింది. అయినా ఎలాంటి ఫలితం లభించలేదు. 200 మీటర్ల ప్రొటెక్షన్ వాల్ ఎత్తు పెంచి తమ పంట పొలాలను కాపాడాలి. లేకపోతే ప్రతిఏటా నష్టపోవాల్సి వస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలతో రిజర్వాయర్‌లో నీరు నిండుతుంది.

– సంకురి దేవన్న, కొరటా గ్రామ రైతు

వేంకటేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: తొలిఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి ఆశీర్వదించారు. బోథ్ నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని వేడుకున్నారు. ఎమ్మెల్యే వెంట వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పండరీ, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, రాథోడ్ సురేందర్, పిడుగు అభిరాం రెడ్డి, వంశీరెడ్డి పాల్గొన్నారు.

బోనాల జాతర పోస్టర్ ఆవిష్కరణ

బోథ్: మండల కేంద్రంలోని కొట్టాల పోచమ్మ ఆలయ బోనాల జాతర పోస్టర్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం ఆవిష్కరించారు. ఈనెల 13న నిర్వహించే బోనాల పండుగకు ఎమ్మెల్యే హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. అనంతరం కొట్టాల పోచమ్మ ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు బోనాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్ కుమార్, ఈవో అంజయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పండుగలు సమాజాన్ని ఏకం చేస్తాయి

గుడిహత్నూర్: పండుగలు సమాజాన్ని ఏకం చేస్తాయని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలో ప్రఖ్యాత పండరీపుర వారీని తలపిస్తూ నిర్వహించిన వార్‌కరీ సాంప్రదాయ దిండీ యాత్రలో పాల్గొన్నారు. జ్ఞానేశ్వరీ గ్రంథాన్ని, విఠల్-రుక్మాయి విగ్రహాలను తలపై ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం వడ్డెర కాలనీలో జరిగిన మొహర్రం ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేను స్థానికులు సత్కరించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమల్ గౌడ్, ఇచ్చోడ మాజీ ఎంపీపీ ప్రీతంరెడ్డి, జాదవ్ రమేశ్, భీంరావ్ నాయక్, రవినాయక్, మాధవ్, రావణ్, రాహుల్ పాల్గొన్నారు.

తాంసి: తాంసి మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పీరీలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సందర్శించుకున్నారు. అనంతరం వామన్ నగర్ గ్రామంలో గ్రామస్తులతో కలిసి మొహర్రం ఉత్సవాల్లో భాగంగా డప్పు చప్పుళ్లకు భక్తులతో కలిసి నృత్యం చేశారు.

ఆలయంలో భక్తుల సందడి

జైనథ్: మండల కేంద్రంలోని ప్రసిద్ధి శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని వివిధ గ్రామాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు.

ఘనంగా తొలి ఏకాదశి

ఇచ్చోడ: మండలంలో ఆదివారం తొలి ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో ఉదయం 5 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖరా(బి), జామిడి, అడేగామ(కె) గ్రామాల నుంచి భక్తులు భజన సంకీర్తనలతో పాదయాత్రగా వచ్చి విఠలేశ్వరుని దర్శించుకున్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. విఠలేశ్వరుని దర్శించుకునేందుకు సాయంత్రం 4 గంటల వరకు భక్తులు బారులు తీరారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

బాబు జగ్జీవన్ రామ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

నేరడిగొండ: మండలంలోని తేజపూర్ గ్రామంలో మాదిగ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దళితుల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ దేశ మాజీ ఉప ప్రధానమంత్రి, మాజీ కేంద్ర వ్యవసాయ, రక్షణ, కార్మిక శాఖ మంత్రిగా, కేంద్ర కేబినెట్ మంత్రిగా సేవలు అందించారని కొనియాడారు. ముందుగా ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు చౌలమద్ది రంజిత్, మహేశ్, రమేశ్, చిన్న ధర్మన్న, రవి, బాబు, అశోక్, గంగయ్య, అడెల్లు, పాలు, చిన్న రాజన్న పాల్గొన్నారు.



ఇచ్చోడలో..

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జగ్జీవన్ రామ్ వివిధ మంత్రిత్వ శాఖల ద్వారా దేశానికి ఎన్నో సేవలను అందించారని కొనియాడారు. కార్యక్రమంలో జగ్జీవన్‌రామ్ కమిటీ సభ్యులు నగేశ్, సాయిరాం, అజయ్, నందు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి



శునకానికి టీకా వేస్తున్న పశు వైద్యాధికారులు

ఆదిలాబాద్‌టౌన్: పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ గోపికిషన్ అన్నారు. జునోసిస్‌డే సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని పశువైద్య శాలలో పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్త లూయిపాశ్చర్ మొదటిసారిగా యుక్త వయస్సులో ఉన్న బాలుడికి యాంటీ రెబిస్ టీకా వేశారని తెలిపారు. పెంపుడు జంతువుల నుంచి మానవాళికి వ్యాధులు సంక్రమించకుండా టీకాలు వేయడం జరుగుతుందన్నారు. పెంపుడు శునకాలకు రెబిస్ టీకాలు వేయించాలని సూచించారు. పశువైద్యాధికారులు దూద్‌రాం రాథోడ్, గజానంద్, రజినికాంత్, పద్మ, ఖాజాపాషా, అమీన్, రమేశ్, సాజిద్, గోదావరి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజం

నార్నూర్: ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజమని మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. గాదిగూడ మండలంలోని ఐటీడీఏ పరిధిలో శాటిలైట్ సెంటర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాదవ్ నారాయణ్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఆదివారం నాగల్‌కొండ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, ఫాక్స్ చైర్మన్ అడే సురేశ్, న్యాయవాది బానోత్ జగన్, మాజీ జెడ్పీటీసీ చారులత రాథోడ్, మాజీ ఎంపీటీసీ ఉత్తం, జాదవ్ గుణవంత రావు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: మొహర్రం పండుగ (యౌమే అష్రా) సందర్భంగా అమన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు అర్బాత్ ఖాన్ రిమ్స్‌లో పండ్లు పంపిణీ చేశారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో కలిసి చిల్డ్రన్స్ వార్డులో పండ్లు, స్నాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అమన్ ఫౌండేషన్ సభ్యులు రాహుల్ గజ్భారే, షేక్ అజీమ్, తదితరులు పాల్గొన్నారు.

9న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

నేరడిగొండ: ఈనెల 9న నేరడిగొండలోని రైతు వేదికలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఏఈ నాగేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నేరడిగొండ, ఇచ్చోడ, బోథ్, బజార్‌హత్నూర్ మండలాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధించాలి



విద్యార్థులను సన్మానిస్తున్న ఉద్యోగులు

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు సంజన, శిరీష, శ్రీజ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఉద్యోగులు విద్యార్థులను ఆదివారం శాలువాతో సత్కరించారు. జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఉద్యోగులు విశేష్ కుమార్, చంద్రకాంత్, సుభాష్, సాయి చరణ్, రవికాంత్, నరేష్, సతీష్, వెంకట్, స్వామి, గణేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మొక్కలు నాటుతున్న కొయ్యాడి గంగయ్య

నేరడిగొండ: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటు పడాలని సామాజిక కార్యకర్త కొయ్యాడి గంగయ్య అన్నారు. తొలి ఏకాదశి, మొహర్రం పండుగ సందర్భంగా ఆదివారం కుప్టి(కె) గ్రామంలో గల కేసీఆర్ పార్కులో గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ తమవంతుగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. చెట్లతోనే వాతావరణం సమతూల్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం వేడుకలు



నృత్యం చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నిర్వహించిన మొహర్రం వేడుకలు ఆదివారం ముగిశాయి. పీరీలకు, దోలలను ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు సమర్పించారు. అదే విధంగా మండలంలోని గొండ్‌గూడలో శనివారం సాయంత్రం సాత్నల మండలంలోని మేడిగూడ గ్రామానికి చెందిన సవా రీలను అతిథిగా తీసుకువచ్చి సంప్రదాయ నృత్యం చేశారు. ఆయా గ్రామాల్లో సంప్రదాయ పూజల మధ్య మొహర్రం వేడుకలను ముగించారు. కార్యక్రమంలో మడావి ఇంద్రు, గేడం జ్ఞానేశ్వర్, చహకటి నాగోరావ్, జల్పత్‌రావ్, మహదు, భారత్, పెందోర్ కృష్ణ పాల్గొన్నారు.

నార్నూర్: గాదిగూడ, నార్నూర్ మండలాల్లో మొహర్రం ఉత్సవాలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో పీరీలను ఊరేగించారు. చివరి రోజు కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. భీంపూర్‌లో హీరాలాల్ పూజారి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుపుకున్నారు.

యథేచ్ఛగా మొరం తవ్వకాలు



మొరం తవ్వకాలు జరిపిన దృశ్యం

నేరడిగొండ: జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పాత కుప్టి జాతీయ రహదారి సమీపంలో కొందరు అక్రమంగా ఎర్ర మొరం తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో అపారమైన అటవీ సంపదను కొంత మంది విక్రయిస్తూ డబ్బును పోగు చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అరికట్టాలని కోరుతున్నారు.



ఇంద్రవెల్లి సమీపంలో గుంతలు పడిన రోడ్డు

అడుగడుగునా గుంతలు



మర్కగూడ సమీపంలో గుంతలు పడిన రోడ్డు

ఇంద్రవెల్లి: మండలంలోని మర్కగూడ, బుర్సన్‌పటర్ గ్రామాల మీదుగా అదిలాబాద్ రూరల్ మండలంలోని చిచ్‌ధరి ఖానాపూర్, సేవదాస్‌నగర్, ఖండాల గ్రామాలకు అనుబంధంగా ఉన్న రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. గుంతలో వరద నీరు నిల్వడంతో వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. అధికారులు దృష్టి సారించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు బాగు చేయండి



బురదమయంగా గుబిడి రోడ్డు

భీంపూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కరంజి(టీ) నుంచి గుబిడి గ్రామానికి వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది. ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని కోరుతున్నారు.